# నందనవనం - 19

‘‘ఎదురుగా లేకపోయారు కాబట్టి బ్రతికిపోయారు... లేకపోతే మీమీదపడి జుట్టు పీకేసేదాన్ని...!’’

‘‘ఎందుకంత కోపం...? నీ ఇష్టాన్ని మీ అమ్మలా మేం ఎవరు కాదనమని చెప్పటం కూడా తప్పేనా...?’’

‘‘తప్పు మీది కాదు... నాదీ! మీది అర్థంకానంత మందబుద్ధా... లేక అర్థం కానట్లుగా అమాయకత్వం చూపిస్తున్నారా....? అసలు నేనే సరిగా చెప్పలేకపోతున్నానా... ఏమిటో నాకూ తెలిసీ తెలియనట్లుగా ఉంది...!’’ అంది నందూ అతని మాటల్ని అనుకరిస్తున్నట్లుగా.

‘‘అవునా..... అయితే సమస్యేముందీ... చక్కగా ముగ్గుల గోల మానేసి... ఇంకేపైనా కబుర్లు చెప్పకూడదూ....?’’

‘‘ముగ్గుల గోల వదిలేయాలా...? ఈ గోల వెనుక ఉన్న నా మనసులోని ఆరాటాన్ని తెలుసుకోవచ్చుగా... ఏదయినా నేనంత తేలిగ్గా వదలను... ఈ ముగ్గుల ముచ్చట ఎదుకు తీసుకువచ్చానో తెలుసా...? మీ ఇంటిముందు ఓ ముగ్గువేసి... ఇంకా సరదా తీరకపోతే మీ వీథిలోని ఇళ్ళన్నింటిముందూ వేసి... మా ఇంటికి తిరిగి రావటానికి కాదు... మీ ఇంట్లోనే ఉండాలంటే... ఓ పద్ధతి అంటూ ఉందిగా... అదెపుడూ అని మిమ్మల్ని అడగాలనే! సరే వివరంగా చెప్పేసానుగా, మీరు ప్రస్తావించిన బొగ్గుల సంగతి... వాటిని రాజేస్తే.... నులివెచ్చని హాయిని కలిగించే సెగలు రేగుతాయి. తెలుసా...? ఏ మాటనైనా మనకి నచ్చిన మలుపులోకే మళ్ళించగల నేర్పు ఉండాలి!’’

‘‘అబ్బా... నీ మాటల వెనుక ఇంత చక్కటి మర్మం ఉందని ఇపుడు బాగా అర్థమై... నిజంగానే... బొగ్గులు రాజేసే అవసరం లేకుండానే నులి వెచ్చని హాయి రగులుతోంది! అయితే మా అమ్మకు చెబుతాను... తొందరగా మీ ఇంటికి వెళ్ళి ఆ ఏర్పాట్లు ఏదో చూడమని...! అలా చేయమని నువ్వే చెప్పావన్న సంగతి మాత్రం చెప్పన్లే...!’’ అంటూ నవ్వాడు.

‘‘మా అమ్మ నిన్న సాయంకాలం ఎవరితోనో మాట్లాడుతూ... మరి ఏ సందర్భం వచ్చిందో తెలియదుగానీ... ఎల్లుండి చాలా మంచి రోజని చెప్పటం విన్నాను. అపుడే నాకీ ఆలోచన వచ్చింది. ఎల్లుండి భోజనానికి రమ్మని పిలిచినట్లుగా చెప్పండి సరేనా...?’’

‘‘సరే... అలాగే చెబుతాను. మా వాళ్ళకి మంచి రోజుల పట్టింపు లేదు కాబట్టి.... ఆ సంగతి లేకుండానే ఈ విషయం ఒక్కటీ చెబితే సరిపోతుంది!’’

‘‘అయినా భోజనానికి రావటం అంటే... అమ్మా నాన్నా వాళ్ళు పిలిస్తేనే బావుంటుంది కదా...?’’

‘‘మాకు అలాంటివేం పట్టింపులు లేవులే... నేను చెప్పినా సరిపోతుంది. అమ్మకి ఇపుడే చెబుతా...’’ ఆ మాటలు పూర్తికాక ముందే... అక్కడికి వచ్చిన శ్రీవల్లి ‘‘ఎవరితో ఇంత పొద్దున్నే మాట్లాడుతున్నావ్....? అమ్మతో చెబుతానని కూడా అన్నావూ...?’’ అంటూ కొడుకుని ఆరా తీసింది.

‘‘అదే నందూ ఫోను చేసిందమ్మా... ఏదో... మనింటి ముందు ముగ్గు వేయాలని సరదా కలిగితే... వాళ్ళమ్మగారు... ఏమిటో కోడలిగా బాధ్యత తీసుకున్నాక... అంటూ

ఏదో అందని చెబుతూ... ఎల్లుండి భోజనానికి వాళ్ళింటికి వస్తే... అవన్నీ మాట్లాడుకోవచ్చని అంటోంది...!''

తత్తరపడుతూ సగం మాటలు మింగేస్తున్నట్లు... మొహమాటంగా ఏదేదో చెబుతున్న రామం వైపు ఆవిడ చిరునవ్వుతో చూసి ''సరేలే... నాకర్థం అయిందిలే... అలాగే వెళ్ళొద్దాం....'' అనేసింది.

రామం చాలాసేపు అటూ ఇటూ దొర్లుతూ పక్కమీదే ఉండిపోయాడు.

మనసులోనుండి నందూ మాటలు మధురమైన గుసగుసలుగా వినిపిస్తూనే ఉన్నాయి! రెండు మూడు రోజులకోసారి అయినా ఇద్దరూ కలిసి ఏవేవో పనులపేరున తిరుగుతూనే ఉంటారు. ఇక ఇంటిపట్టున ఉన్నపుడూ తనతో కలిసి కలల విహారమే...! నిజానికి వాస్తవంకంటే కలల్లో మునిగి తేలటమే బావుంటుందని అంటారు. ఏమో... తనకి మాత్రం వాస్తవంలో... ఇంటా బయటా నందూ సాన్నిహిత్యమే బావుంటుందనిపిస్తోంది...!

అమ్మ తరచూ అంటూనే ఉంటుంది... 'మనుష్యుల సంఖ్య పెరుగుతూ ఉంటేనే ఇంటికి నిండుదనం వస్తుంది...! కోడలూ, ఆ తర్వాత మనవలూ... వాళ్ళతో ఇల్లంతా కళకళ లాడే రోజులు త్వరగా రావాలీ...!' అని. దానికి నాన్న అవునంటూనే దానికి ఇంకా కొంచెం సమయం ఉందనిపిస్తోందంటూ జరుపుతూ వచ్చారిన్నాళ్ళూ.

ఇపుడు నందూయే సూచన చేసింది కాబట్టి ఇక అమ్మా నాన్న అంగీకరించక తప్పదు! అంటే... నందూ తొందరలోనే తమ ఇంటికి వచ్చేస్తుంది.... వసంతాన్ని వెంట బెట్టుకుని!

అతని పెదవుల పైకి కనీ కనిపించని చిరు నవ్వుల దొంతర వచ్చేసింది! ఆ ఆలోచనతో దుప్పటి విసిరికొట్టి మంచంమీద నుండి ఉత్సాహంగా లేచాడు. ఏదో తెలియని ఉల్లాసంతో అతని మనసంతా నిండిపోయింది....!

* * *

భద్రయ్య గారింటికి భోజనానికి వెళ్ళాలనే ఉద్దేశంతో శ్రీవల్లి ఇంటిపనులన్నీ చకచకా ముగించేసింది. ఇంతలో ఎవరివో మాటలు వినిపించేసరికి బయటకు వచ్చి చూసింది. అక్కడ అరుగుమీద కూర్చుని ఉన్న పున్నమ్మా, వాళ్ళ వీధిలోనే ఉండే సరళా కనుపించారు. ఇద్దరూ సరళా వాళ్ళ చేనుకి వెళ్ళి ఒకవారగా వేసిన వంగమొక్కల నుండి లేత వంకాయలు ఇన్ని కోసుకువచ్చారట. కాసిని అక్కడా ఇచ్చిపోదామనీ, దారిలో అలసట తీర్చుకోవటానికన్నట్లు కాసేపు కూర్చోవటమూ బావుంటుందని అక్కడ చేరామని చెప్పారు. సరళ ఇ...న్ని వంకాయలు ఇవ్వబోతే, 'ఇన్నెందుకమ్మా' అంటూ శ్రీవల్లి తమకు సరిపడా కాసిని తీసుకుని ఇంట్లో పెట్టి వచ్చి వాళ్ళతోపాటూ తనూ కూర్చుంది.

పట్టులంగా, జాకెట్టూతో వాళ్ళ వెంట వచ్చిన నాలుగేళ్ళ పాపను చూసి ''ఎవరూ...?'' అనడిగింది శ్రీవల్లి. జడలో ఎర్రగులాబీ పెట్టుకున్న ఆ పాప కళ్ళింత చేసుకుని పరిసరాలను పరిశీలిస్తూ సరళను ఆనుకుని కూర్చుంది.

ఆ పాపను ముచ్చటగా చూస్తూ రమ్మనమన్నట్లుగా శ్రీవల్లి చేతులు చాపింది.

''మా చెల్లెలు ఊరునుండి వచ్చిందమ్మా. వాళ్ళమ్మాయే... నేను పున్నమ్మ పిన్నితో కలిసి బయలుదేరి వస్తోంటే... తనూ వస్తానంటూ మారాంచేసి వెంటబడింది....!'' అంటూ సరళ ఆ పాప వివరాలను చెప్పుకొచ్చింది.

శ్రీవల్లి ఆ పాప వైపు ముద్దుగాచూస్తూ ‘రావా’ అని అడిగింది.

పున్నమ్మ చిన్నగా నవ్వేసరికి... సరళ వెంటనే అడిగింది. ‘‘ఎందుకు నవ్వుతున్నావు పిన్నీ...?’’ అని.

‘‘ఏదో గుర్తుకొచ్చి... అంతేలే....’’ అంది పున్నమ్మ.

‘‘అదేమిటో మాకూ చెప్పకూడదా, మేమూ నవ్వుకుంటాంగా...?’’

‘‘సరే... నువ్వడిగావు కాబట్టి చెబుతాలే... ఆ మధ్య మా వాడి దగ్గరకు వెళ్ళొచ్చినప్పటి నుండీ.... ఏపైనా అమెరికా కబుర్లు చెప్పమని అడిగిన వాళ్ళే... ఆ తర్వాత అబ్బో.... ఈవిడగారికి బడాయి ఎక్కువైంది... మాటి మాటికీ ‘అమెరికాలో ఉండగా....’ అంటూ ఊదర గొడ్తూందని నవ్వుకుంటున్నారన్న కబురు విని... ఇక అలా చెప్పటం మానేసా. అయినా మనం ఏం చేసినా, వెనక నవ్వుకునేవాళ్ళు, వెక్కిరించే వాళ్ళు ఉండనే ఉంటారు, ఎవరికీ ఇబ్బంది కలిగించనంత వరకూ పరవాలేదు, మన ఇష్టం మనదే అనుకుని చేసెయ్యటమే ఏదైనా అనిపించింది! ఈ ఆలోచన రాగానే నేనూ నా ధోరణి నాదే అన్నట్లుగా ఉంటున్నాననుకో....!

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే... అక్కడున్నపుడు ఓసారి మా వాడి కుటుంబంతో నేనూ ఓ షాపింగ్ మాల్‌కి వెళ్ళానా... నేను తిరగలేకపోతోంటే, అక్కడోచోట నన్ను కూర్చోబెట్టి... అందరూ అటువేపున్న షాపులోకి వెళ్ళారు. నాకూ కొంచెం దూరంగా వెళ్తోన్న వాళ్ళల్లో ఒకమ్మాయి నన్ను చూసి చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయింది. నా కట్టుబొట్టు, వాలకం చూసి పరిహాసంగా నవ్విందనిపించి... మనసు చివుక్కుమంది! మావాడొచ్చి... ఎందుకలా ఉన్నావంటే, ఇదే చెప్పాను. ‘పరిహాసంగా కాదు, ఇక్కడ కొందరు పలుకరింపుగా అలా నవ్వుతార్లే’ అని చెప్పాడుగానీ నాకు నమ్మకం

కుదరలేదు. నేను చిన్న బుచ్చుకున్నానని అలా సర్ది చెప్పాడనిపించింది. మరి... ఆ అమ్మాయితో పాటుగా వచ్చిన వాళ్ళు వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళిపోయారుకదా, నన్ను చూసి కూడా ఈ అమ్మాయి మాత్రమే ఎందుకు పలుకరించినట్లుగా అలా నవ్వుతుందీ... తప్పకుండా పరిహాసంగా మాత్రమే నవ్వి ఉంటుందని నాలో నేనే తీర్మానించుకున్నాను. గంటు పెట్టుకున్న నా మొహాన్ని గమనించి మా వాడూ ఊరడించాడనే నా కనిపించింది.

ఇంతలో ఎవరో ఇద్దరు చిన్నపిల్లలతో అక్కడకు వచ్చి కూర్చున్నారు. రబ్బరు బొమ్మలా బొద్దుగా, ముద్దుగా ఉన్న ఆ పిల్లను చూసేసరికి నాకు చాలా ముచ్చటగా అనిపించి... చిన్నగా నవ్వాను. ఆ అమ్మాయి తల్లి భుజం మీద నుండే నన్నూ చిరునవ్వుతో చూసింది.

షాపు నుండి బయటకు వచ్చిన మా కోడలు నన్ను గమనించింది కాబోలు, నా దగ్గరకు వచ్చి ‘‘ఆ చిన్న పిల్లను మీరలా వెక్కిరిస్తున్నారెందుకూ...? వాళ్ళమ్మ చూసి గోల చేసిందంటే... అబ్బో... అదో పెద్ద గొడవవుతుంది...!’’ అంది మెల్లగా.

నాకు విడ్డూరంగా అనిపించాయా మాటలు.

‘‘బావుంది... .చిన్న పిల్లను చూసి ముద్దుగా అనిపిస్తే.... నవ్వుతూ చూడమా, అదీ తప్పేనా...?’ అని రెట్టించాను.

‘‘కాదామరీ... ఇక్కడ ఇంతమంది అలా చూసి వాళ్ళ దోవన వాళ్ళు వెళ్ళిపోతున్నారే గానీ, ఎవరూ నవ్వలేదుగా, మురిపెంగానో, ముచ్చటగానో అని ఆ చిన్నపిల్ల తల్లికి తెలియదుగా, మీరేదో మాయచేసే బాపతని అనుకునే అవకాశం ఉందిగా! అని ఎదురు అడిగింది.

అక్కడి పద్ధతులు ఇంత విచిత్రంగా ఉంటాయా అని నేను బిత్తరపోతూంటే... అపుడు మా కోడలు నవ్వుతూ వివరం చెప్పింది. 'ఇందాక మిమ్మల్ని చూసి ఎవరో అమ్మాయి పలుకరింపుగా నవ్విందంటే... మీరు నమ్మలేదు. మీ కట్టూ బొట్టు చూసి వేళాకోళంగా నవ్విందేమోననే అనుమానం మాత్రం మీకు తీరనేలేదనీ.... మీ అబ్బాయి చెప్పార్లెండి. చూశారా మరి... మీరు మామూలుగా చిన్న పిల్లను చూడగానే ముచ్చటపడి నవ్వారు. అలాగే ఇక్కడ కూడా కొంతమంది కొత్త వాళ్ళనయినా సరే పలుకరించి విష్ చేస్తున్నట్లుగా చిరునవ్వుతో చూస్తారంతే...!' అంటూ విపులంగా చెప్పుకొచ్చింది! అపుడు గానీ నా మనసు తేలిక పడలేదు! హాయిగా నవ్వుకున్నాను! ఇపుడు అదంతా గుర్తుకొచ్చి మళ్ళీ నవ్వొచ్చింది.... అంతే...!'' అంటూ పున్నమ్మ చెప్పటం ముగించింది.

మిగతా వాళ్ళిద్దరూ కూడా 'బావుంది' అంటూ నవ్వుమొహాలతో చూశారు.

''కాసేపు కూర్చోండి.... నేనూ మీతో కలిసి వస్తాను... మీరెళ్ళే దారిపైపేగా భద్రయ్య అన్నయ్యగారిల్లూ...' అంటూ లోపలకు వెళ్ళిన శ్రీవల్లి అయిదు నిమషాలలోనే రెడీ అయి వచ్చింది.

''మీరూ మాతో వస్తారా....?'' అన్నారు వాళ్ళిద్దరూ. ''కొంచెం ఎండగా కూడా ఉంది. మీరు నడవటం ఎందుకనీ అంటున్నాం...!'' అంటూ నసిగారు.

శ్రీవల్లి నవ్వింది ''ఏం ... నీరెండలా ఉంది. అంతేగా... చక్కగా కబుర్లు చెప్పుకుంటూ నాలుగడుగులు నడిచి వెళ్ళటమే బావుంటుంది కదా...?'' అంటూ ఎదురు ప్రశ్నించింది.

‘‘అదికాదమ్మా... మీరు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసినవాళ్ళు. కార్లలో తప్ప తిరిగిన వాళ్ళు కాదుగదా... అలవాటు లేని పనికదా... కష్టంగా ఉంటుందనీ అలా అనిపించింది! మారిన పరిస్థితులవల్ల... మీరీవూరు వచ్చి... ఇలా కష్టపడాల్సి వచ్చింది! సుబ్బయ్యగారేమో, పొలం పనులు చేయటం... మీరేమో పొలానికి అన్నమూ పట్టుకెళ్ళటం... ఆశ్చర్యంగా ఉంది, మా అందరికీ...!’’ అంటూ సరళ నిట్టూర్చింది.

పున్నమ్మా అదే ధోరణిలో అంది ‘‘విధిరాత అంటే ఇదేను. మహా మహా పాండవులంతటివాళ్ళకే వనవాసం, అజ్ఞాతవాసం తప్పలేదు...! చివరకు సీతారాములకూ అంతేకదా...!’’

శ్రీవల్లి వాళ్ళిద్దరి మాటలకు చిరునవ్వు నవ్వింది.

‘‘ఈ ఊరుకు రావటం, మీ అందరితో కలిసి బ్రతకటం... మేం కోరుకున్నదే కాబట్టి మాకేం కష్టంగా లేదు! కావాలనుకుంటే ఏవో ఉద్యోగాలు దొరక్కపోవు. వ్యాపారాల ఆలోచనా చేయొచ్చును! కానీ ఏదైనా ఇక్కడే చేయాలనుకున్నాం కాబట్టి వ్యవసాయం బావుంటుందనిపించింది. మావాడు... ఇంకో విధమైన ఆలోచనా చేస్తూనే ఉన్నాడు...ఇంకో మాట చెప్పనా...?’’ అంటూ ఇద్దరివైపూ చూసి మళ్ళీ అంది.

‘‘కారులో రయ్‌మని దూసుకు వెళ్ళినా, కాలినడకన నిదానంగా సాగినా... రెండు విధానాల్లోనూ ఆనందం ఉందనుకుంటే... సమస్యేమీ ఉండదు! ఎక్కడైనా, ఏ పరిస్థితుల్లోనైనా కుటుంబంతో కలిసి ఉంటే చాలు అదే ఆనందమని భావించే వాళ్ళమే మేమంతా! అందుకే... ఏ కష్టమూ అనుభవిస్తున్నట్లులేదు. పైగా పోగొట్టుకున్నదేదో తిరిగి పొందినట్లుగా చాలా సంతృప్తిగానూ ఉంది!’’ ‘అవునా’ అన్నట్లు ఆశ్చర్యంగా

చూసిన వాళ్ళిద్దరి వైపూ సెలవు తీసుకుంటున్నట్లు చూసింది శ్రీవల్లి... భద్రయ్యా గారి ఇంటిముందు ఆగి.

తనకోసమే ఎదురుచూస్తున్నట్లు నిలబడిన ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళతో కలిసి వాళ్ళింటి లోపలకు అడుగులు వేసింది శ్రీవల్లి. వాళ్ళు చూపించిన మర్యాదలకూ, ఆపేక్షకూ ఉక్కిరి బిక్కిరి అయిపోయిందో క్షణం... పూజ గదిలోకి వెళ్ళి... వాళ్ళతో పాటు దేముడికి దండం పెట్టుకోవటం లాంటివన్నీ పూర్తయ్యాక కాసేపు కబుర్ల కాలక్షేపం జరిగింది.

భద్రయ్య భార్య చూపులకు చాలా అమాయకురాలిలా అనిపించింది, శ్రీవల్లికి. ఎందుకో తెలియదుగానీ కొందరు రూపు రేఖలను బట్టి కల్లా కపటం తెలీని వ్యక్తులనిపిస్తారు...! ఆవిడ శ్రీవల్లిని 'వదినగారూ' అని సంబోధిస్తూ చాలా మెల్లగా ఒకటి రెండు మాటలు మాత్రమే పలికింది... అదీ మర్యాదల్లోని భాగంగానే!

భద్రయ్య మాత్రమే మాటలు కలిపే బాధ్యతను తీసుకున్నట్లుగా ప్రవర్తించాడు.

ముందుగా శ్రీవల్లిని కాసేపు ప్రశంసలతో ముంచెత్తి... ఆమె మనసును ఆకట్టుకునే ప్రయత్నం చేసాడు. బాగా చదువుకున్నా ఏ మాత్రం భేషజం లేకుండా ఆ వూరి జనంతో కలిసిపోయిన తీరు తనకెంతో ముచ్చట కలిగించటమే కాదు, ఆమె వ్యక్తిత్వం పట్ల గౌరవాభిమానాలనూ పెంచిందంటూ పొగడ్తల వర్షం కురిపించాడు.

ఆ తరువాత తెలివిగా సంభాషణను తనకు కావల్సిన విధంగా నడిపించాడని శ్రీవల్లికి అనుమానం వచ్చింది.

రామాయణంలో శ్రీరాముడు తండ్రి మాటను జవదాటడని పేరు సంపాదించినట్లు ఈ కాలంలో మీకొడుకు తల్లి ఇష్టాన్ని మన్నించటమే గానీ, ఎపుడూ వ్యతిరేకించడనే పేరు పొందినట్లుగా వాళ్ళ దృష్టికి వచ్చిందన్నాడాయన. అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. కాబట్టి.... ఆమె భద్రయ్య మాటలకు అవునని అంగీకరిస్తున్నట్లు ఆనందంగా తలవూపింది. తమ తల్లీ కొడుకుల అనుబంధం అందరికీ ఆదర్శమంటూ ఆయన ప్రశంసించటం శ్రీవల్లికీ ఆనందం కలిగించింది!

తరువాత... సంభాషణ ప్రేమలూ పెళ్ళిళ్ళ వైపు దారి తీసింది. మీ అబ్బాయి రామానిది ప్రేమ వివాహమా, మీరు కుదిర్చిన సంబంధమా అని ఏదో యథాలాపంగా వాకబు చేసినట్లుగా ప్రశ్నించేసరికి... శ్రీవల్లి భద్రయ్యకు సగర్వంగా వివరించింది.

''మా వాడికి పరమేశ్వరంగారి అమ్మాయి నందూతో ముందు నుండీ పరిచయం ఏమీ లేదు. ఆ అమ్మాయే వచ్చి తన కాలేజీలోనే చదువుతున్నానన్న విషయం చెప్పేవరకూ ఆ విషయం మా వాడికీ తెలియనే తెలియదు. మేమూ ఆ అమ్మాయిని చూసాం కదా, నచ్చటంతో వాళ్ళిద్దరికీ వివాహం జరిపించాలనే నిర్ణయానికి వచ్చాం.

ఆ తరువాత నుండీ... వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ పెరిగిందనుకోండీ. అందుకే పై చదువుల ప్రసక్తి విరమించుకుని... ఈ వూళ్ళోనే ఏదో ప్రాజెక్టు ప్రారంభించే పనిలో ఉన్నాడు...!'' అంటూ చెప్పటం ముగించాక భద్రయ్య ''అలాగా... ఇదంతా నాకు తెలియదమ్మా... మీరు పిల్లల ప్రేమను అంగీకరించారనుకున్నా! ఈ రోజుల్లో పిల్లలు... తమ ప్రేమను ఒప్పుకోకపోతే నుయ్యో, గొయ్యో చూసుకుంటామని బెదిరించటం రివాజయిపోయింది కదండీ...! అయితే మీరు అలా కాకుండా... మీరు కుదిర్చిన సంబంధాన్నే మీ అబ్బాయి కాదనకుండా అంగీకరించేటట్లు చేసారు! అంతేలెండి... అదే మంచిది. ప్రేమ పెళ్ళిళ్ళు అంటే ఏముందీ... వెనకా ముందూ ఏం ఆస్తిపాస్తులు

ఉన్నాయో లేవో చివరకు చదువూ సంధ్యా సంగతీ కూడా గమనించరు, సరికదా 'ఎపుడు ఎవరిమీద ప్రేమ ఎందుకు పుడుతుందో ఎలా చెప్పగలం....?' అంటూ వితండవాదన చేస్తారు! మీరు కూడా నాలాగే ప్రేమ వివాహానికి వ్యతిరేకం....! అంతే కదమ్మా...?'' అనడిగాడు.

శ్రీవల్లి తల అడ్డంగా వూపింది. ''మీరు పొరబడ్డారు! మామూలుగా పెద్దవాళ్ళం మన పిల్లలకు సంబంధాలు నిర్ణయిస్తాం... ఆ తరువాత వాళ్ళు ప్రేమగా సంసారాలు సాగించి సుఖంగా ఉండాలనీ కోరుకుంటాం! అలాగే... వాళ్ళంతట వాళ్లుగా తమకు నచ్చిన వాళ్ళని ఎన్నుకుని ప్రేమించామని చెబితే, పెళ్ళికి అంగీకరించాల్సిందేనని నా అభిప్రాయం. మనకి నచ్చని విషయాలూ, అభ్యంతరాలూ ఉంటే వివరించాలే తప్ప శాసించకూడదని నా అభిప్రాయం. పెళ్ళికి ముందయినా, తర్వాతయినా ప్రేమ అనేది మాత్రం చాలా ముఖ్యం! అది ఉంటే... ఏదో కొన్ని కష్టనిష్టూరాలు ఎదురైనా... సహనంతో ఎదుర్కోగలుగుతారు! లేకపోతే ఏముందీ... ఒకరినొకరు తప్పులెన్నుకుంటూ తన్నుకు చస్తారు! వాళ్ళిష్టానికే ప్రాధాన్యత ఉండాలనేది నా అభిమతం! ఎదిగిన పిల్లలకు అన్ని విషయాలనూ వివరించటం... నచ్చ చెప్పాలనుకోవటం వరకూ పెద్దలకు బాధ్యత తప్పకుండా ఉంటుంది. వారు మొండికేస్తే... ఏ కష్టనిష్టూరాల కయినా వాళ్ళదే బాధ్యత అనుకుని పెద్దవాళ్ళు అంగీకరించటమే మంచిదని నా అభిప్రాయం!''

వివరంగా చెప్పిన శ్రీవల్లి మాటలను విని భద్రయ్య కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ ''అలాగా అమ్మా... నేనే మీ అభిప్రాయాలు వేరే అని ఊహించుకుని పొరబడ్డానన్నమాట!'' అన్నాడు.

ఆ తరువాత ఏవో కొన్ని కబుర్ల తరువాత భద్రయ్య ఇంకో విషయం ప్రస్తావించాడు. ''సుబ్బయ్య కులాల కుమ్ములాట కూడదని... అంతటా అందరికీ

నచ్చచెబుతున్నాడా... పుట్టు పూర్వోత్తరాల దగ్గర్నుండీ మొదలు పెట్టి... కులాల తారతమ్యం, ప్రాధాన్యత పనికిరావని... మొత్తుకుంటున్నట్లు ప్రచారం చేస్తున్నాడా... ఆ విషయం గమనించినా, గమనించినట్లే... పద్మనాభం... ఎంత అపవాదు వేసాడో తెలుసునా...? పైకి అలా చెబుతారుగానీ... 'మాటలు మాటలే... చేతలు మాత్రం వేరే' అన్నట్లు కొడుకు పెళ్ళిని మాత్రం కులం గోత్రం, ఆస్తి, అంతస్తు అన్నీ చూసి... అన్నీ ఉన్నవాళ్ళమ్మాయినే ఎన్నిక చేసాడని అంటున్నాడమ్మా...!

నిప్పుకు చెదలు పడతాయనటం ఎంత తప్పుమాటో... సుబ్బయ్యకు కులాభిమానం అంటగట్టడమూ అలాంటిదేనని నేను వాదించానుగానీ... అది వేరే విషయం అనుకో అమ్మా...! ఆ పద్మనాభానికి ఎంత చెప్పినా చెవిటివాడి ముందు శంఖం వూదినట్లు...! తన వాదనే కరెక్టు అంటాడు...! కొడుకు పెళ్ళితోనే ఈ విషయం రుజువు అయిందిగా అన్నాడమ్మా...!'' అంటూ భద్రయ్య నిట్టూర్చాడు.

శ్రీవల్లికి ఇదంతా ఆశ్చర్యంగా అనిపించింది.

''అలా కలిసి వచ్చిందిగానీ, మేం కులం గురించి ఆలోచించలేదు. పిల్లలకూ ఇష్టమైంది కాబట్టి సమస్యేమీ రాలేదు... అంతే...! దీనిని ఎవరైనా ఇంకోలా అనుకుంటే.... మనం చేయగలిగిందేం ఉందీ...!'' అనేసింది శ్రీవల్లి నిర్లిప్తంగా.